ఈవారం కథ

ఫోనులో పెళ్ళిళ్ళ పేరయ్య చెప్పినవార్త పిడుగులా ధ్వనించింది వెంకటాద్రికి.

మేకు దిగ్గొట్టినట్లు కుర్చీలో బిగుసుకు పోయాడు.

"ఇదెలా సాధ్యం?" ఎంత తల బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

వెంకటాద్రి పెద్ద కూతురు దీప. పేరుకి తగినట్లే చిదిమి దీపం పెట్టుకోవచ్చు. అందాల భరిణె. ఆడపిల్లల కాలేజీలో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోంది.

వెంకటాద్రి అంతో ఇంతో కలిగిన వాడే. చిన్నా పెద్దా కాంట్రాక్టులు చేసి బాగానే గడించాడు. కట్నం కానుకలిచ్చి ఆడపిల్లలకి పెళ్ళి చెయ్యగల స్థోమతు గలవాడే.

ఏడాది నుంచి కూతురికి సంబంధాలుచూస్తున్నాడు.

కాని సరి అయినది ఏమీ కుదరటం లేదు. పెళ్ళి కొడుకులకి ఒకటి వుంటే ఇంకొకటి వుండడం లేదు.

దీప ఇంటికి పెద్ద కూతురు. కాస్త ఆలస్యంగానైనా మంచి సంబంధం చెయ్యాలని బాగా చదువుకున్న అల్లుడ్ని తేవాలని తాపత్రయపడుతున్నాడు.

కిందటి నెల్లో పెళ్ళిళ్ళ పేరయ్య ఒక సంబంధం తెచ్చాడు.

# ఊహించని ఉత్తరం



-కౌకొని కమల

అవసరం అయిన దానికంటే చౌకగా 'కట్టడం' పూర్తిచేసి లాభాలు మిగుల్చుకునే కాంట్రాక్టు పని లాంటిది కాదు పెళ్ళంటే. గట్టి పునాదుల మీద నిలిచే భవంతి లాంటిది పెళ్ళి!

"వెంకటాద్రిగారూ! ఈ సంబంధం కుదిరితే మీకొట్టె విరిగి నేతిలో పడినట్లే. ముఖ్యంగా మీ అల్లుడు మీకు కుడి భుజం అవుతాడు" అన్నాడు సంబరంగా.

"నసక్క ముందు అసలు విషయం చెప్పవయ్యా!" విసుక్కొన్నాడు వెంకటాద్రి.

"పెళ్ళి కొడుకుది విశాఖపట్నం. స్టీలు ఫ్యాక్టరీలో ఉద్యోగం.ఇంజనీరు. డాబా గార్డెన్స్‌లో ఇల్లు, బీచ్‌కి దగ్గర్లో ఐదెకరాల కొబ్బరి తోట వున్నాయి. ఒక్కడే కొడుకు. తల్లి తప్పించి వేరే చెప్పుకోదగ్గ బంధువులు లేరు...."

" ఇంతకీ కట్నం...కానుకల విషయం ఎంతలో వున్నారు?"

"అదే వస్తున్నా. అతనికి బాగా అందంగా వుండే డిగ్రీ చదువుకొన్న అమ్మాయి కావాలట. కట్న కానుకలు అక్కర్లేదట. కాని పిల్ల మాత్రం చాలా అందంగా వుండాలని గట్టి షరతు పెట్టాడు. ఏవో సంబంధాలు చూస్తున్నారట. కాని పిల్ల నచ్చక వదిలేస్తున్నారట. సరే... మీ అమ్మాయి చక్కని చుక్క. ఆ కుర్రాడికి నచ్చవచ్చని నా నమ్మకం. అదీ సంగతి"అన్నాడు.

వెంకటాద్రికి ఆశ పుట్టింది.

పచ్చగా మొగిలి పొత్తులా వుండే కూతురు రూపం కళ్ళముందు కదిలింది.

"నా కూతురని కాదుగాని మా దీప దేవకన్య కదటయ్యా. అటు నా భార్య తరపునగాని ఇటు నా తరపునగాని అంత అందమైన పిల్ల మా వంశంలోనే లేదు.."

"మరి అందుకే కదండి. ఈ సంబంధం గురించి మీకు చెప్తుంట. పక్క వీథి ప్లీడర్ రంగారావుగారు కూడా వాళ్ళ అమ్మాయికి సంబంధాలు చెప్పమన్నారు. కాని ఆ పిల్ల మోస్తరుగా వుంటుంది. అందుకని వాళ్ళకి ఈ విశాఖ సంబంధం గురించి చెప్పలేదు. పిల్ల కుందనం బొమ్మలా వుండాలని ఆ ఇంజనీరు గట్టి రూలు పెట్టాడట. ఆ మాట వినగానే నాకు దీప గుర్తుకు వచ్చింది. మీ దగ్గరకి పరిగెట్టుకు వచ్చాను" అన్నాడు.

"మరింకేం ఆలస్యం? పెళ్ళి చూపులు ఏర్పాటు చెయ్యి..."

"అదీ మాట్లాడాను.. ఆ అబ్బాయి వచ్చే నెల్లో వారం రోజులు శెలవు పెడుతున్నాడట! ఆ కుర్రాడి తల్లి ఆరోగ్యం అంత మంచిది కాదట. బి.పి. పేషంటట. కొడుకు పెళ్ళి చూడాలని తొందరపడుతోందట."

"అలాగా?"

"అవును. విజయవాడ నుంచి కూడా ఏదో సంబంధం వచ్చిందట. ఆ పిల్ల కూడా చాలా అందంగా వుంటుందిట. కాలేజి బ్యూటీగా మూడవ బహుమతి సంపాదించుకుందిట. సంగీతం బాగా పాడుతుందిట. మన దీపలాగే డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతోందిట. పెళ్ళికొడుకు వచ్చే నెల్లో సెలవుపెట్టి ముందుగా ఆ విజయవాడ పిల్లని చూసుకుని, అట్నుంచి ఇటు హైద్రాబాదు వచ్చి మన దీపని చూసే ఏర్పాట్లు కూడా చేశాను. మీరు ఊ..అనటమే తరువాయి"

"ఇంకా తరువాయి ఏమిటయ్యా. చూపులు ఏర్పాటు చేసెయ్యి" అన్నాడు.

అనుకున్న ప్రకారం కిందటి నెల్లో ఇంజనీరు పెళ్ళి కొడుకు రవికుమార్ విజయవాడలో పిల్లనిచూసి అట్నుంచి ఇటు వచ్చి దీపని చూసి, ఏ సంగతి వారం పది రోజుల్లో చెప్తామని వెళ్ళారు.

ఈ సంబంధం మీద చాలా ఆశపెట్టుకున్నాడు వెంకటాద్రి. ఎందుకంటే పెళ్ళి కొడుకు హీరోలా అందంగా వున్నాడు. పెద్ద ఇంజనీర్. అంతో ఇంతో ఆస్తి కలవాడు. పైగా కట్నం వద్దంటున్న ఆదర్శ యువకుడు. అత్తపోరు,ఆడబిడ్డ పోరు లేని కాపురం. నిజంగా ఈ సంబంధం కుదిరితే అప్సరస లాంటి తన కూతురి సంసారం స్వర్గమే అవుతుంది అని సంబరపడి పోతున్నాడు. కాని అంతలోనే మనసులో ముల్లులా ఆ విజయవాడ పిల్లగాని ఆ రవికుమార్‌కి నచ్చుతుందేమోనన్న శంక పట్టుకుంది.

ఎందుకంటే-

తన కూతురు దీప అందగత్తే గాని బహుమతులు రాలేదు. పైగా సంగీతం రాదు. ఏ విధంగా చూసినా విజయవాడ పిల్లది పై చేయిగా అనిపిస్తోంది.

వెంకటాద్రి విజయవాడ పిల్ల గురించి బాగా వాకబు చేశాడు. నిజంగానే ఆ పిల్ల కాలేజి బ్యూటీగా మూడవ బహుమతి అందుకుందని త్యాగయ్య కీర్తనలు గొప్పగా పాడుతుందని, బుద్ధిమంతురాలని తెలిసింది. దాంతో వెంకటాద్రికి దిగులుపట్టుకుంది.

నోటికి వచ్చిన కూడు ఎక్కడ మట్టి పాలు అయిపోతుందోనన్న దిగులుతో బాగా ఆలోచించి ఎలాగైనా ఆ ఇంజనీరు పెళ్ళి కొడుకు తన ఇంటి అల్లుడు కావాలన్న దుర్బుద్ధితో ఒక పథకం తయారుచేసి, దాన్ని తక్షణం తు.చ. తప్పకుండా అమలు పరిచేశాడు వెంకటాద్రి.

పెళ్ళి చూపులు జరిగి వారం గడిచిపోయింది.

తప్పకుండా తమ సంబంధమే స్థిరపడుతుందన్న ధీమాతో వాళ్ళ దగ్గర్నుంచి వుత్తరం కోసం ఎదురు చూస్తున్నాడు.

వారం గడిచింది.

పది రోజులు గడిచాయి.

విశాఖ వాళ్ళ దగ్గర్నుంచి జవాబురాలేదు.

పెళ్ళిళ్ళ పేరయ్య అయిపు లేదు.

"ఏమయ్యింది చెప్మా! పదిహేను రోజులు కావస్తుంది వాళ్ళుపిల్లని చూసుకు వెళ్ళి. బంగారం లాంటి సంబంధం. ఆ విజయవాడ వాళ్ళు ఎగరేసుకుని పోలేదు గదా?... అబ్బెబ్బె.. అలా జరగడానికి వీల్లేని విధంగా తన పథకం వేసినాడే! మరి...?....."

వెంకటాద్రి ఇలా తర్జన భర్జన పడుతున్న సమయంలో పెళ్ళిళ్ళ పేరయ్య దగ్గర్నుంచి ఫోనువచ్చింది.

"ఆ ఇంజనీరు పెళ్ళికొడుకు రవికుమార్ విజయవాడ వాళ్ళ సంబంధం ఖాయం చేసుకుని ముహుర్తాలుకూడా పెట్టుకొన్నారన్న వార్త అశనిపాతంలా వెంకటాద్రి నెత్తిన పిడుగులు కురిపించింది. దిమ్మెరపోయి మేకు దిగ్గొట్టినట్లు అలాగే కుర్చీలో కూర్చుండిపోయాడు.

ఎటూ పాలు పోవటం లేదు.

మాటా పలుకూ లేని వాడిలా అలా ఎంత సేపు కూర్చుండి పోయాడో తెలియదు.

అంతలో-

"పోస్ట్" అన్న కేక వినిపించి ఉలికి పడ్డాడు.

గుమ్మంలో పడి వున్న ఉత్తరం అందుకుని ఫ్రం అడ్రస్ చూశాడు. విశాఖనుంచి పెళ్ళి కొడుకు రాశాడు.

వెంకటాద్రి కళ్ళు చిత్రంగా ముడుచుకున్నాయి.

ఆత్రంగా ఉత్తరం చించాడు.

"నా వివాహం విజయవాడ అమ్మాయితో వచ్చే నెల్లో మొదటి వారంలో జరగాలని పెద్దలు ముహూర్తం పెట్టి నిశ్చయ తాంబూలాలు తీసుకున్నారు.

"ఆ అమ్మాయి శీలం మంచిది కాదని, పోకిరి కుర్రాళ్ళతో విచ్చలవిడిగా తిరుగుతుందని, అందగత్తెనని గర్వమని, ఇప్పటికే రెండు సార్లు రహస్యంగా గర్భస్రావం చేయించుకొందని" మీరురాసిన ఆకాశరామన్న వుత్తరం అందింది.

ఆ ఉత్తరం మీరే రాశారని నాకు ఖచ్చితంగా తెలుసు. కారణం.. ఆ ఉత్తరం చిక్కడపల్లిలో పోస్టు అయినట్లు దాని మీద స్టాంపు చెపుతూంది. మీరువుండేది అక్కడేకదా!

అంతేకాదు-

మీ అమ్మాయిని చూసుకుందుకు రమ్మని ఆహ్వానిస్తూ మీరు స్వదస్తూరితో రాసి పేరయ్యగారిద్వారా పంపిన ఉత్తరంలోని దస్తూరి,మీరు రాసిన ఆకాశరామన్న ఉత్తరంలోని దస్తూరి ఒకటే.

మీరే ఆకాశరామన్న ఉత్తరం రాశారనడానికి ఇంత కంటే వేరే నిదర్శనం అక్కర్లేదనుకుంటాను.

నిజానికి నాకు దీప, అందం, గ్లామరూ చాలా నచ్చాయి. విజయవాడ అమ్మాయి శ్రీలత సంగీతం నచ్చింది.

ఒకవేళ దస్తూరి మార్చి ఆ ఉత్తరం విజయవాడ నుంచి నుంచి పోస్టు చేసి వుంటే క్షణికావేశంలో ఆ ఉత్తరాన్ని నేను నమ్మి వుండేవాడ్నేమో!

నిజానికి నా మనసు దీపనే ముందు నిర్ణయించుకొంది.

కాని-

ముగ్గురు ఆడపిల్లలకి తండ్రి అయివుండి ఇంకొక ఆడపిల్ల జీవితం అప్రదిష్ట పాలు చెయ్యాలనుకున్న మీ సంకుచితత్వం నాకు ఏవగింపు కలిగించింది.

అందుకే నేను శ్రీలతనే నిర్ణయించుకున్నాను.

ఇదే ప్రయోగం మీ దీప మీద ఎవరన్నా చేస్తే ఎలా వుంటుందో ఒక్కసారి ఊహించుకోండి.

ఒక ఆడపిల్ల తండ్రిగా మీ బాధ అర్థం చేసుకోగల్ను. కాని అవసరం అయిన దానికంటే చౌకగా కట్టడం పూర్తిచేసి లాభాలు మిగుల్చుకొనే కాంట్రాక్టు పని లాంటిది కాదుపెళ్ళంటే.

గట్టి పునాదుల మీద నిలిచే భవంతి లాంటిది పెళ్ళి.

పునాది శాస్త్రీయ పద్ధతిలో గట్టిగా లేకపోతే ఎంత గొప్పదైనా ఆ భవంతి నిలబడ లేదు.

తల్లి దండ్రుల గుణగుణాలే పిల్లలకి అంతో ఇంతో వుంటాయని నా నమ్మకం.

అర్థం అయ్యిందనుకుంటాను.

మంచి వరుడు సోదరి దీపకి దొరకాలని నా ఆశీస్సు.

- రవికుమార్"

ఫోనులో పేరయ్య మాటలేనెత్తిన పిడుగుల్లా పడ్డాయి అనుకొంటే ఆ ఉత్తరం మరో పిడుగు పాటులా వెంకటాద్రిని కుప్పకూల్చింది.